సాక్షి కర్నూలు

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వెండి రథోత్సవం చేపట్టారు.



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి నెల్లూరుకు చెందిన అరుంధతి రూ.1,08,000 విరాళంగా అందజేశారు.



ఉరుకుందలో భక్తుల రద్దీ

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండో సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాల్లో కిక్కిరిసి కనిపించాయి.

న్యూస్‌రీల్

యూరప్ పర్యటనకు కలెక్టర్

- ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వ అనుమతి
- ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): కలెక్టర్ డాక్టర్ జి.సృజన విదేశాల్లో పర్యటించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సోమవారం జీఓ ఆర్‌టీ 1479 విడుదల చేశారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఆమె కుటుంబ సభ్యులతో కలిసి విదేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన పూర్తిగా ఆమె వ్యక్తిగతం. ప్రతి సంవత్సరం ఏదో ఒక దేశంలో పర్యటిస్తానని, అందులో భాగంగా ఈ ఏడాది యూరప్‌కు వెళ్తున్నట్లు కలెక్టర్ 'సాక్షి'కి తెలిపారు. ఈనేపథ్యంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం తరువాత కలెక్టర్ విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లనున్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు మొత్తం 890 మంది పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళిక 2023-24 ప్రకారం, పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వారిని బ్యాచ్‌లుగా విడదీసి ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ రిఫ్రెషర్ శిక్షణ ఇస్తామన్నారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో కర్నూలు జిల్లాకు చెందిన నాలుగు బ్యాచ్‌లకు, నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ బ్రెట్టో సెంటర్, ప్రేమగిరిలో నంద్యాల జిల్లాకు చెందిన ఐదు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

4న ఏడు పంచాయతీల్లో ఉప సర్పంచు ఎన్నిక

కర్నూలు(అర్బన్): జిల్లాలో వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచు ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మండలం రేమట, దిగువపాడు, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, కోతిరాళ్ల, కౌతాళం మండలం కుంబలనూరు, వెల్దుర్తి మండలం లక్ష్మీనగరం, ఆస్పరి మండలం యాటకల్లు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచులను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఈ గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 4న ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి ఉప సర్పంచును ఎన్నుకుంటారన్నారు.


5,637 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పండ్లతోటల అభివృద్ధిలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. 2023-24లో జిల్లాలో 5వేల ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే 3,079 మంది రైతులకు సంబంధించి 5,637 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఇప్పటి వరకు 4,925 ఎకరాల్లో పిట్టింగ్ పనులు పూర్తి కాగా.. 4,357 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం కూడా పూర్తయింది. సెప్టెంబర్ నెల మొదటి వారంలోపు పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా నీటియాజమాన్య సంస్థ ఉందని ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పల్లె పెదాలపై చిక్కటి చిరునవ్వు



గడివేముల మండలం సోమాపురం గ్రామానికి చెందిన రామగోవింద్ కుటుంబానికి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.60,456, పంటలబీమా రూ.15,478, సున్నావడ్డీ రూ.15,352, చేయూత ద్వారా రూ.75వేలు, రైతుభరోసా రూ.54వేలు, పింఛన్ కానుక ద్వారా రూ.19,250 కలిపి మొత్తం రూ.2,39,536 వచ్చింది. అలాగే ఇతని కుమారుడు ఆదినారాయణ కుటుంబానికి ఆసరా, సున్నావడ్డీ, రైతుభరోసా, అమ్మ ఒడి ద్వారా రూ.1.81లక్షలు, రూ.2లక్షల విలువ చేసే ఇంటి స్థలం లబ్ధి చేకూరింది. ప్రభుత్వ సాయంతో రెండు గేదెలు కొనుక్కున్నారు. వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆదినారాయణ భార్య మహేశ్వరి తన ముగ్గురు పిల్లలను బాగా చదివిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం అందించిన సంక్షేమంతో ఈ కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.



కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయినిపేటకు చెందిన మాబుజాన్, మాహబూబ్ బాషాకు ముగ్గురు అమ్మాయిలు. ఒక కుమారుడు. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. వీరికి కేవలం 54 సెంట్ల పొలం మాత్రమే ఉంది. అరకొర ఆదాయంతో ఇబ్బందులు పడేవారు. వీరికి అమ్మఒడి రూ.29వేలు, ఆసరా రూ.19,920, రైతుభరోసా రూ.44,500, సున్నావడ్డీ రూ.4,608 అమ్మఒడి రూ.29వేలు, ఆసరా రూ.19,920, రైతు భరోసా రూ. 44,500, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.4,608 మొత్తంగా రూ.98,036 లబ్ధి చేకూరింది. వీటితో పాటు రూ.2లక్షల విలువ చేసే ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి మరో రూ.2.50లక్షలు మంజూరైంది. మొత్తంగా రూ.5.48లక్షలు లబ్ధి చేకూరింది. బాషా నాపరాయి గనుల్లోకి పనికి వెళ్తుంటారు. సర్కారు దన్నుతో సంతోషంగా జీవిస్తున్నారు.



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో మారిన పల్లె జీవన విధానం

- సర్కారు ప్రోత్సాహంతో కుటీర, పాడిపరిశ్రమలు, వ్యాపారాలు
- ఆర్థిక దన్నుతో పిల్లలకు మంచి చదువులు అందిస్తోన్న తల్లిదండ్రులు
- సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, నూతన వ్యవస్థలతో ప్రతి పల్లెలో సగటున 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు
- ప్రభుత్వ ఉద్యోగాలతో స్థిరపడి సంతోష జీవనం
- శ్రమిస్తే కొలువు సులువని యువకుల్లో పెరిగిన పట్టుదల



ఈ చిత్రంలోని మహిళ పేరు షేక్ మాబున్ని. కల్లూరు మండలం తడకనపల్లి పొదుపు మహిళ. ఏడాది కిందటి వరకు గృహిణిగా ఇంటి పనులు మాత్రమే చూసుకునేవారు. ప్రభుత్వం సబ్సిడీతో సోలార్ డ్రయర్స్ ఏర్పాటు చేసుకుని ఉల్లి, టమాటా ఫ్లేక్స్ తయారు చేస్తోంది. దీంతో రోజూ రూ.600 చొప్పున నెలకు రూ.18వేల దాకా సంపాదిస్తోంది. ఇప్పుడు ఆమె తన ఇంటికి ఆర్థిక దన్నుగా నిలుస్తోంది.

ఈ మూడు ఉదాహరణలు చూస్తే 'పల్లెసీమలు' సంతోషంగా జీవిస్తున్నాయని స్పష్టమవుతోంది. ప్రతీ పల్లెలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తీసుకొచ్చిన సంస్కరణలతో అభివృద్ధిలో పల్లె ముఖచిత్రంతో పాటు జీవన విధానంలో భారీ మార్పులు వచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 2019కి ముందు, ఇప్పుడు పల్లెల్లో పాలన, విధాన పర మార్పులతో పాటు విద్య, ఉద్యోగాల్లో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. దీంతో పల్లె ప్రజల ఆలోచన ధోరణి, యువకులకు భవిష్యత్‌పై ప్రణాళిక పూర్తిగా మారిపోయాయి.

సాక్షి ప్రతినిధి కర్నూలు: గ్రామ సచివాలయ వ్యవస్థ, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలతో కొత్త నిర్మాణాలు గ్రామంలో కనిపిస్తున్నాయి. వీటన్నింటిలో కలిపి సగటున 20మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. రోజూ వీరంతా ఆయా పల్లెల్లో ఉండటం, పల్లె పరిధిలోని వెయ్యి-2వేల మంది జనంతో తరుచూ మాటామంతీ కలుపుతున్నారు. అలాగే ఈ వ్యవస్థల ద్వారా ప్రతి పల్లెలో సగటున 10-15 ఉద్యోగాలు వచ్చాయి. ఒక్కసారి ఇన్ని ఉద్యోగాలు రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. ఉద్యోగాలు వచ్చిన వారంతా కుటుంబాల్లో స్థిరపడిపోయారు. దీంతో ఈ కుటుంబాలను చూసి ఇరుగుపొరుగు కుటుంబాల తల్లిదండ్రులు, యువకుల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. శ్రమిస్తే తమకూ సర్కారు కొలువు దక్కుతుందని బలంగా నమ్ముతున్నారు. ఆ దిశగా కష్టపడి చదువుతున్నారు. మరోవైపు ఉద్యోగులతో గ్రామస్తులు రోజూ మాటామంతీ కలపడంతో ప్రభుత్వ పథకాలపై స్పష్టమైన అవగాహన వస్తోంది. పిల్లల చదువు, ఉపాధి అవకాశాలపై చైతన్యం వస్తోంది. దీంతో ఖాళీగా రచ్చబండ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పడం కంటే ఏదో రకంగా కష్టపడి కుటుంబానికి దన్నుగా ఉండాలి, పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలనే భావన ఏర్పడింది.

పల్లె సరిహద్దు దాటాల్సిన పని లేకుండా..

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవస్థల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు అన్నీ సచివాలయాల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏ పనికీ బయటకు వెళ్లాల్సిన పనిలేదు. దీంతో వ్యయ, ప్రయాసలు తగ్గాయి. అలాగే ఆర్బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. వ్యవసాయ రంగంలో రైతులకు దన్నుగా నిలవడంతో దేశానికి దిక్సూచిగా ఆర్బీకేలు నిలిచాయి. విలేజ్ క్లినిక్‌లు పల్లెలు ఆరోగ్యం జీవించేందుకు దోహదపడుతున్నాయి. ఏ జబ్బు వచ్చినా గ్రామ గడప దాటకుండా నాణ్యమైన చికిత్స అందుతోంది. డిజిటల్ లైబ్రరీలను తీసుకొచ్చి పోటీ పరీక్షలకు విద్యార్థులు తర్ఫీదు అయ్యేందుకు చర్యలు తీసుకొచ్చింది. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, పీహెచ్‌సీలను అభివృద్ధి చేసింది. పిల్లలకు నాణ్యమైన చదువు, పెద్దలకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా నగదు బదిలీగా వచ్చిన డబ్బులతో పాడిపశువులు, చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. సోలార్ డ్రయర్స్‌తో ఉపాధి పొందుతున్నారు. వచ్చే నెల ఆఖరుకు 5వేల సోలార్ డ్రయర్స్ ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. ఈ ఏడాది ఆఖరుకు 10వేల డ్రయర్స్ ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇలా ప్రతి ఇంటి సంక్షేమాన్ని తమ సంక్షేమంగా ప్రభుత్వం భావించింది. దీంతో ప్రతి పల్లె చిక్కగా చిరునవ్వులు చిందిస్తోంది.



అభివృద్ధి ఇలా:

కర్నూలు, నంద్యాల జిల్లాలో సచివాలయ ఉద్యోగుల సంఖ్య: 6,999

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రాధాన్యత భవన నిర్మాణాలు

విభాగం	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
సచివాలయాలు (గ్రామ, వార్డు)	1,188	348.4
రైతు భరోసా కేంద్రాలు	840	183.11
వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు	602	105.35
డిజిటల్ లైబ్రరీలు	313	52.13
బల్క్ మిల్క్ యూనిట్లు	153	26.94

కొన్ని ముఖ్య ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో ప్రజలకు అందిన లబ్ధి ఇలా:

పథకం	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న విద్యాదీవెన	324.99
జగనన్న వసతి దీవెన	164.92
వైఎస్సార్‌చేయూత	666.76
వైఎస్సార్ ఆసరా	592.62
వైఎస్సార్ రైతుభరోసా	1608.08
అమ్మ ఒడి	2039.91
ఉచిత పంటలబీమా	1108.78

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- పేద విద్యార్థులకు చదువే పెద్ద ఆస్తి
- జగనన్న విద్యా దీవెన పథకం మెగా చెక్కును అందజేసిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు



విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంపీ సంజీవ్‌కుమార్, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): పేద విద్యార్థులకు చదువే పెద్ద ఆస్తి అని, ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరి నుంచి జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి ఫీజురీయంబర్స్‌మెంట్‌ను విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య,విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయన్నారు. ఉన్నత విద్య పేదలకు భారం కాకుడదన్న ఆలోచనతో జగనన్న విద్యా, వసతి దీవెన పథకాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..గతంలోని ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్‌లో పది శాతం కూడా కేటాయించే వారు కాదన్నారు. ప్రస్తుతం విద్య, వైద్య శాఖలకు అధికంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ..వచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో 35,074 మంది తల్లుల ఖాతాలో రూ.25కోట్లను జమ చేసినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులక మెగా చెక్కును అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, గిరిజన సంక్షేమ శ్రీనివాసరావు, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహాపర్వీన్ పాల్గొన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా..



నేను కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాను. మాది నిరుపేద కుటుంబం. మా నాన్న రాధాకృష్ణ వ్యవసాయం చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జగనన్న విద్యా, వసతి దీవెన పథకం ఉండటంతో ఖర్చులకు ఇబ్బంది లేకుండా నన్ను చదివిస్తున్నారు. కాలేజీ, హాస్టల్ ఫీజుల కోసం రూపాయి కూడా చెల్లించడం లేదు. అంతా ప్రభుత్వమే చూసుకుంటోంది.

– రాధిక, కర్నూలు

ఉన్నత చదువులకు ఆటంకం లేదు



మా నాన్న నజీర్ రోజూ కూలీ పనికి వెళ్తారు. వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నడపడమే కష్టం. ఇక నన్ను చదివించడం అయ్యే పనా అనుకున్నాను. అంతలోనే జగనన్న సీఎం కావడం..పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో ఇప్పుడు నేను కేవీ సుబ్బారెడ్డి కాలేజీలో పీజీ ఫస్టియర్ చదువుకుంటున్నాను. జగనన్న వసతి, విద్యా దీవెనలతో ఉన్నత చదువులకు ఎలాంటి ఆటంకం లేదు.

– శశి, కర్నూలు

అసైన్డ్ భూముల వివరాల సేకరణలో నిర్లక్ష్యం

- అధికారులపై జేసీ మౌర్య అసహనం



డీ సెక్షన్‌లో తనిఖీలు చేస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): అసైన్డ్ భూముల వివరాల సేకరణలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని జేసీ నారపురెడ్డి మౌర్య అసహనం వ్యక్తంచేశారు. సోమవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా కలెక్టరేట్‌లోని డీ, ఈ సెక్షన్లను తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసెక్షన్ అధికారుల తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములకు సంబంధించి ఒక్క గ్రామం వివరాలు కూడా రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వివరాలు తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు.

తుంగా తీరం.. ఆరాధన సంబరం

- నేటి నుంచి సద్గురు ఆరాధన మహోత్సవాలు
- వారం రోజులపాటు రాఘవేంద్రుల వేడుకలు
- సెప్టెంబర్ 2న మహా రథోత్సవం
- పూర్వారాధన వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్!



రాఘవేంద్రుల మూల బృందావనం

మంత్రాలయం: భక్తకోటి కల్పతరువు శ్రీరాఘవేంద్రస్వామి. సశరీరంగా చింతామణి సదృశ్యులైన స్వామి వారి 352వ ఆరాధన సప్త రాత్రోత్సవ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో వారం రోజుల పాటు వేడుకలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఆరాధనోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. శ్రీరాఘవేంద్ర స్వామి ప్రశస్తి అవార్డులు అందుకోవడానికి ప్రముఖులు మంత్రాలయం రానున్నారు. ఏపీ రాష్ట్ర గవర్నర్ నజీర్.. పూర్వారాధన వేడుకల్లో పాల్గొననున్నట్లు సమాచారం. ఉత్సవాల నేపథ్యంలో వేదభూమి మంత్రాలయం విద్యుద్దీప కాంతుల్లో వెలుగులీనుతోంది.

పూర్తయిన ఏర్పాట్లు

ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి శ్రీమఠం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల వసతి కోసం హెచ్‌ఆర్‌బీ, భూ, దుర్గారమణ, నరహరి, పద్మనాభ డార్మెటరీలు, పాత పరిమళ విద్యానికేతన్ పాఠశాలలను కేటాయించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు 50 మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు. నదిలో నీటి కొరత దృష్ట్యా పుణ్య స్నానాలకు వంద షవర్లు ఏర్పాటు చేశారు. మఠం సీఆర్‌ఓ, ప్రధాన ముఖద్వారం, మఠం ప్రాకారం, అన్నపూర్ణ భోజనశాల దారిలో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఆరు లక్షల పరిమళ ప్రసాదాలు తయారు చేశారు. మహా రథోత్సవం సందర్భంగా హెలికాప్టర్ నుంచి పూలవాన కురిపించనున్నారు.

వేడుకల నిర్వహణ ఇలా..

- మంగళవారం రాయరు ఉత్సవాలు ప్రారంభోత్సవంలో భాగంగా ధ్వజారోహణ, ధాన్యపూజ, రజిత మంటపోత్సవం, గో, గజ, తురగ పూజలు చేస్తారు.
- బుధవారం శాఖోత్సవం, రజత మంటపోత్సవం ఉంటుంది.
- గురువారం పూర్వారాధన సందర్భంగా రజత సింహ వాహనోత్సవం నిర్వహిస్తారు.
- శుక్రవారం మధ్యారాధన సందర్భంగా రాఘవేంద్రుల బృందావనానికి మహా పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్ర సమర్పణ ఉంటుంది. గజ, రజత, స్వర్ణ రథోత్సవాలు ఉంటాయి.



రాములోరి పూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

- శనివారం ఉత్తరారాధన సందర్భంగా మహా రథోత్సవం, వసంతోత్సవం జరుపుతారు.
- ఆదివారం శ్రీ సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన, అశ్వ వాహనోత్సవం ఉంటుంది.
- సోమవారం సర్వ సమర్పణోత్సవంలో భాగంగా బంగారు పల్లకీ, చెక్క, వెండి, బంగారు రథోత్సవాలు ఉంటాయి.



విద్యుద్దీప కాంతుల్లో శ్రీమఠం

అవార్డుల ప్రదానం

ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేయనున్నారు.



పూర్వారాధన రోజున ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రాలయం రానున్నట్లు సమాచారం. విద్వాన్ రామవిఠలాచార్య, శతావధాని గరికపాటి నరసింహారావు, టాటా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చంద్రశేఖరన్, ఎంఐటీ శాంతి యూనివర్సిటీ వ్యవస్థాపకులు డా.విశ్వనాథ్‌కు రాయరు అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేయనున్నారు. మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్ .. భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

సకల సౌకర్యాలు

పరమ గురువు రాఘవేంద్రస్వామి 352 ఆరాధన సప్తరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నాం. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పించాం. వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. శౌచాలయాలు, నదీ తీరంలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు చేశాం. ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఉదయం 11 గంటల నుంచే అన్నదానం ప్రారంభం కానుంది.

– సుబుధేంద్రతీర్థులు, శ్రీమఠం పీఠాధిపతి

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధురాలి దుర్మరణం

చాగలమర్రి: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై మద్దూరు మెట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. ఆమె ఎడమ చేతిపై శిరీష అనే పేరుతో పచ్చ బొట్టు ఉంది. వంగపూత, తెలుపు రంగు చీర, జాకెట్ ధరించింది. కొన్నాళ్లుగా చాగలమర్రిలో భిక్షాటన చేస్తూ జీవించేది. ఆచూకీ తెలిసిన వారు 9121101166, 9121101168కు సమాచారం ఇవ్వాలని చాగలమర్రి ఎస్‌ఐ తెలిపారు.

గంగపూజకు వెళ్లి యువకుడి మృతి


రామలింగడు(ఫైల్)

నందవరం: మండలంలోని పూలచింత గ్రామానికి చెందిన బోయ రామలింగడు(18) గంగపూజకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇవి.. వాన దేవుడు కరుణ కోసం పూలచింత గ్రామానికి చెందిన 101 భక్తులతో గంగపూజ కోసం జొహరాపురం గ్రామానికి బయలు దేరారు. ఆ గ్రామంలోని తుంగభద్ర నదిలో తన స్నేహితులు రామకృష్ణ, నాయుడుతో కలిసి రామలింగడు స్నానానికి వెళ్లాడు. నదిలో స్నానం చేసుకుంటూ లోతులోకి వెళ్లిపోయాడు. గమనించిన స్నేహితులు బయటకు తీసేందుకు వెళ్లగా వీలుకాలేదు. బయటకు వచ్చి ఇతరులకు తెలపడంతో వారు రామలింగడిని నీళ్లలో నుంచి బయటకు తీసుకువచ్చారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు రామలింగడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు బోయ లక్ష్మి, నీలన్న బోరున విలపించారు.

సకాలంలో బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 10 తేదీలోపు బిల్లులు చెల్లించి వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేశామని, ఇప్పటి వరకు చెల్లించని వినియోగదారులు బిల్లులు చెల్లించి అపరాధ రుసుము, డిస్కనెక్షన్ నుంచి మినహాయింపు పొందాలని కోరారు.


బ్యాలెన్స్ చేస్తూ..


జిమ్నాస్టిక్ నేర్చుకుంటూ..



క్రీడా సంకల్పం.. స్ఫూర్తిదాయకం

పాదరసంలా కదులుతూ ఫుట్‌బాల్‌ను అందుకోవడమే కాదు.. మెరుపు వేగంతో గోల్ కొట్టడమూ ఓ కళ.. ఆ కళను సాధన చేస్తూ కొందరు విద్యార్థులు.. పరుగెత్తడమంటే అషామాషీ కాదు.. గుండె లయను క్రమబద్ధీకరించుకోవాలి..శ్వాస చలనాన్ని అదుపు తప్పనీయకుండా చూసుకోవాలి.. కండరాల బిగువుతో లంఘించేందుకు ఎంతో మెలకువ ఉండాలి..అలాంటి నైపుణ్యాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు యువకులు...కాళ్లకు చక్రాలు కట్టుకుని స్కేటింగ్ చేస్తుంటే ఆ మజానే వేరు.. అందుకు బాలెన్స్ అవసరం.. దానిని సాధన చేస్తూ చిన్నారులు.. సోమవారం కర్నూలులోని బి.క్యాంపు క్రీడా మైదానంలో కనిపించారు. మంగళవారం క్రీడా దినోత్సవం సందర్భంగా వీరిలోని క్రీడా సంకల్పం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


స్కేటింగ్‌లో మెలకువలు నేర్చుకుంటూ..


పరుగును సాధన చేస్తూ..

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద మృతదేహం కనిపించింది. రైల్వే పోలీసులు, రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. గోపాల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 65 సంవత్సరాలు ఉంటుందని, నీలపు రంగు గళ్ల అఫ్ అంగి, నీలం రంగు డిజైన్ కలిగిన పంచ, తెల్లని కట్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. షర్టు కాలర్‌పై స్టార్ వే పికెడి అనే టైలర్ లేబుల్ ఉందన్నారు. గుర్తు పట్ట కలిగిన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

ఆబోతు కేంద్రం పరిశీలన

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఫారంలోని ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రాన్ని సోమవారం ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల విజయ్‌కుమార్ పరిశీలించారు. అక్కడి డాక్టర్లు చంద్రశేఖర్, సత్యనారాయణ, జగదీష్, అమృత, లావణ్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనవాసి ఘనీకృత వీర్య అబోతు కేంద్రానికి మంచి గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అబోతు వీర్యాన్ని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈయనతో పాటు పశుగణాభివృద్ధి సంస్థ అదనపు ముఖ్య కార్యదర్శి రజనీకుమారి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, కడప జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండా మాధవరెడ్డి, చిత్తూర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ సతీష్‌కుమార్, డాక్టర్లు చిరంజీవి, వసంతరాయులు పాల్గొన్నారు.

ఆదోనిలో చైన్‌స్నాచింగ్


సీసీ ఫుటేజీలో ముఖానికి మాస్కు వేసుకొని బైకుపై వెళ్తున్న ఇద్దరు దుండగులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని పిరమిడ్ కేంద్రం వద్ద ఓ మహిళ వాకింగ్‌కు వెళ్లి తిరిగొస్తుండగా ఇద్దరు దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వెంకన్నపేటకు చెందిన నాగరత్నమ్మ రోజుమాదిరిగానే వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా పిరమిడ్ కేంద్రం వద్ద దుండగులు కాపుకాసి ఒక్కసారిగా ఆమె మెడలో చైన్ లాక్కొన్నారు. ఈ సమయంలో ఆమె మెడలో చేయి పట్టుకోవడంతో దుండగులకు సగం చైన్ తీసుకెళ్లారు. వెంటనే ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నించగా బైకుపై వేగంగా తప్పించుకున్నారు. వెంటనే ఆమెతో పాటు భర్త టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్ నాయక్ తన సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళపై చైన్‌స్నాచింగ్ జరిగింది. ఈ విషయంపై టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

శ్రీమద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.79.71 లక్షలు



బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి హుండీ ఆదాయం రూ. 79.71 లక్షలుగా వచ్చింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడుడు, పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో మూడు నెలలకు సంబంధించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. నగదు రూపేణా 79,71,105, 27.800 గ్రాముల బంగారం, 3.500 కిలోల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మీనాయుడు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'ఆల్కాలీస్' కాలుష్యంతో 10 గ్రామాల్లో ఇబ్బందులు

- ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా
- ఒక్కో గ్రామంలో పది శాంపిల్స్ తీయండి
- కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్


మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(అర్బన్): నగర సమీపంలోని రాయలసీమ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడుతున్న కాలుష్యంతో పరిసరాల్లోని 10 గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించి ఒక్కో గ్రామంలో 10 శాంపిల్స్ తీసి ఎంత మేరకు కాలుష్యం అవుతుందో పరీక్షించి రిపోర్టులను తనకు అందించాలని ఆయన గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన (ఎస్‌ఏజీవై) కింద ఎంపికైన గ్రామల్లో జరుగుతున్న అభివృద్ధిపై ఆయన జిల్లా కలెక్టర్ డా.జీ సృజనతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ... ఆల్కాలీస్ ఫ్యాక్టరీ కాలుష్యం, ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానన్నారు. ఎస్‌ఏజీవై కింద ఎంపికైన ఐదు గ్రామాల్లో ఇప్పటి వరకు 141 అభివృద్ధి పనులకు గాను 111 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలన్నింటినీ ఈ గ్రామాల్లో అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం రూ.2 కోట్లు కేటాయిస్తామని, ఈ నిధులతో ఐదు గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటుకు, శ్మశాన వాటికలు, రోడ్ల నిర్మాణాలకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో కనీసం వంద జన ఔషధి స్టోర్లు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్యను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కర్నూలులో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరానికి 25 కిలో మీటర్ల దూరంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం తన సొంత నిధులు రూ. కోటి ఖర్చు చేస్తున్నానని, ఇందులో రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వ సహకారం అందించే అవకాశం ఉంటుందేమో అనే విషయాలను పరిశీలించాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మాట్లాడుతూ.. సన్‌సద్ ఆదర్శ్ గ్రామ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం తదితర అంశాల్లో అభివృద్ధి సాధించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి పి వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, డీపీఓ నాగరాజు నాయుడు, ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస కుమార్, పీఆర్ ఎస్‌ఈ కె సుబ్రమణ్యం, డీఈఓ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి రూ.లక్ష డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌కు చెందిన సంతోష్ నాయక్, బెళగల్ ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఎర్రన్న అనే వ్యక్తి ఆరు మాసాల క్రితం రూ.లక్ష తీసుకుని మోసం చేశాడని సి.బెళగల్‌కు చెందిన షేక్‌షావలి ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ కృష్ణకాంత్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందనకు మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి. చట్ట పరిధిలో వాటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు స్పందనకు వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఈశ్వర్ ఇన్‌ఫ్రా నుంచి ఒక ఫ్లాట్ కొనుగోలు నిమిత్తం రూ.10 లక్షలు చెల్లించామని, డాక్యుమెంట్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని గురుబ్రహ్మ నగర్‌కు చెందిన సరోజ ఫిర్యాదు చేశారు.
- హౌసింగ్ లోన్ ఇవ్వడానికి సిబిల్ స్కోర్ తక్కువ ఉందని, దానిని పెంచి లోన్ ఇప్పిస్తానని చెప్పి ఏకాంబరమూర్తి అనే వ్యక్తి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఇందిరమ్మ కాలనీకి చెందిన కురువ నాగేంద్రుడు ఫిర్యాదు చేశారు.
- సర్వేయర్ కె.సుబ్బారెడ్డి తన పొలానికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా సొంతంగా కొలతలు వేసి హద్దురాళ్లు ఏర్పాటు చేశాడని, తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన ఫయాజ్ బాషా ఫిర్యాదు చేశారు.
- పంచాయతీరోడ్‌కు గోడ అడ్డంగా కట్టి బడికి వెళ్లే పిల్లలకు దారి లేకుండా చేసి ఒక వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆస్పరి మండలం పలుకూరుబండ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు.

పరుగులో డీలా!

- 158 మంది అభ్యర్థులకు నిరాశ

కర్నూలు: ఎస్‌ఐ ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు పరుగులో చతికిలపడుతున్నారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో మూడో రోజు దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1600 మీటర్ల పరుగు ఎనిమిది నిమిషాలు, 100 మీటర్ల పరుగు 15 సెకండ్లు, లాంగ్‌జంప్ 3.80 మీటర్లు నిర్ణీత లక్ష్యం కాగా.. గడువులోగా గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. సోమవారం మొత్తం 800 మంది అభ్యర్థులను పిలువగా 541 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వివిధ ఈవెంట్లలో ప్రతిభ కనపరచి 383 మంది తుది రాత (మెయిన్స్) పరీక్షకు ఎంపికయ్యారు. హాజరైన వారిలో 158 మందికి నిరాశ తప్పలేదు. లాంగ్‌జంప్‌లో కూడా కొందరు నిర్ణీత లక్ష్యాన్ని ఛేదించలేకపోయారు.

30వ తేదీ నుంచి మహిళలకు పోటీలు

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహిళలకు సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు. 2,097 మంది మహిళలు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించారు. వీరంతా కేటాయించిన తేదీల్లో సామర్థ్య పరీక్షలకు హాజరుకానున్నారు. వెరిఫికేషన్‌కు కచ్చితంగా ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని, లేటెస్ట్ కులధృవీకరణ, క్రిమిలేయర్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కు లిస్టులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ సంతకంతో కూడిన జిరాక్స్ సెట్లు తీసుకురావాలని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో కుక్కల దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. సోమవారం ఒక్కరోజే వివిధ ప్రాంతాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. శారద కమిటీ రోడ్డు 18వ వార్డులో ఐదు సంవత్సరాల బాలిక సంగీత తీవ్రంగా గాయపడింది. అలాగే ఎంఎస్ నగర్‌లో జయలక్ష్మీ, 9వ వార్డులో జీవరత్నం, ఆలీ, 4వ వార్డులో మల్లికార్జున, 18వ వార్డులో తిమ్మప్ప, తేరు బజార్‌లో ముంగప్పలు కుక్కల దాడిలో గాయపడ్డారు. మండల పరిధిలోని గుడేకల్‌లో ఉసేని, రంగస్వామి, పులేంద్ర, గువ్వలదొడ్డిలో లక్ష్మీ, ఎర్రకోటలో రామాంజనేయులు, తెర్నేకల్‌లో మంజుల, పెద్దనెలటూర్‌లో రాజ్‌కుమార్‌లు కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. బయటకు చిన్నపిల్లలను పంపాలంటే కుక్కలను చూసి భయమేస్తోందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల దాడి నుంచి పిల్లలు, పెద్దలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

స్టేడియంలో నేడు జాతీయ క్రీడాదినోత్సవం

- హాజరుకానున్న ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా 18 క్రీడాంశాల్లో బాల బాలికలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. విజేతలైన క్రీడాకారులకు జాతీయ క్రీడా దినోత్సం కార్యక్రమంలో బహుమతులు, మెమొంటోలు, షీల్డ్‌లు అందజేస్తున్నారు. స్టేడియం ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన ధ్యాన్ చంద్ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, మేయర్ బీవై రామయ్య. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, సీఈఓ రమణ పాల్గొననున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు


స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ

కర్నూలు: మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి జీవితాలను పాడు చేస్తున్నారని తల్లిదండ్రులను ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్, ఓల్డ్ ఈద్గా, ఐదు రోడ్ల కూడలి ప్రాంతాల్లో సోమవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ఒక్కొక్క వాహనంపై ముగ్గురు మైనర్లు వెళ్తుండగా తనిఖీ చేసి పోలీసులు 25 మందిని అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేసి కొత్తపేట వద్ద ఉన్న ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారి తల్లిదండ్రులను పిలిపించి పిల్లల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో పట్టుబడిన మైనర్లకు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా వారి ప్రవర్తనలో మార్పు రానందున తదుపరి చర్యల నిమిత్తం పట్టుబడిన 25 వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

- ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం
- 154 మద్యం సీసాలు, 260 లీటర్ల నాటుసారా, 15 కేజీల నవసాగరం సీజ్


సీజ్ చేసిన వాహనాలు

కర్నూలు: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అసాంఘిక, సంఘ విద్రోహ శక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ సబ్ డివిజన్ల వారీగా కట్టడి (కార్డన్ సెర్చ్ ఆపరేషన్) చేపట్టారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కర్నూలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుపేటలో విస్తృత తనిఖీలు చేపట్టారు. దాడుల్లో సీఐలు నాగశేఖర్, శ్రీరామ్, లక్ష్మయ్య, కళావెంకటరమణ, సుగుణకుమారి, కిరణ్‌కుమార్, శ్రీధర్, శివశంకర్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని సబ్ డివిజన్ పరిధిలో..

డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఇస్వి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదిరె గ్రామంలో, పత్తికొండ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో దాడులు నిర్వహించారు. సీఐలు విక్రమ సింహా, నిరంజన్‌రెడ్డి, మురళీమోహన్, వెంకటేశ్వర్లుతో పాటు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 154 మద్యం సీసాలు, 260 లీటర్ల నాటుసారా, 4,500 లీటర్ల సారా బెల్లం ఊట ధ్వంసం చేసి 15 కేజీల నవసాగరం స్వాధీనం చేసుకున్నారు.

మట్కాపై ఉక్కుపాదం...

మట్కా నిర్వహణపై రెండు మాసాల వ్యవధిలో 111 కేసులు నమోదు చేసి 124 మందిని అరెస్టు చేసి రూ.19.8 లక్షలు సీజ్ చేశారు. అలాగే క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచి ఐదు కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేసి రూ.80.46 లక్షలు సీజ్ చేశారు. బైండోవర్ కింద 411 మందిని అదుపులోకి తీసుకుని సంబంధిత మెజిస్ట్రేట్ల ముందు హాజరుపరిచినట్లు ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు.